సాక్షి
చిత్తూరు
మంగళవారం । 13 । జూన్ । 2023



బడుగుల బంధువు జగన్
పుంగనూరులో సోమవారం ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, క్రిస్టియన్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. - 8లో



చెంగాళమ్మ వియోత్సాహం
సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం తెప్పపై విహరించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	40	28
తిరుమల	35	24
గూడూరు	42	31
నగరి	41	28

న్యూస్‌రీల్

నేడు బోయకొండకు ఎంపీ అవినాష్‌రెడ్డి



చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ దర్శనానికి మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విచ్చేస్తున్నట్లు చిత్తూరు, రాజంపేట పార్లమెంటరీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిద్దింటి కిషోర్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బోయకొండ క్రాస్ వద్ద తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఎంపీ అవినాష్‌రెడ్డికి ఘనస్వాగతం పలకనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతలు, పెద్దిరెడ్డి అభిమానులు తరలిరావాలని కోరారు.

బోయకొండ హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం హుండి లెక్కింపు చేపట్టారు. 43 రోజుల్లో అమ్మవారికి కానుకల రూపేణా రూ.79.81లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ చంద్రమౌళి తెలిపారు. అలాగే 120 గ్రాములు బంగారం, 990 గ్రాముల వెండి, 2 సింగపూర్ డాలర్లు, 10 నేపాల్ కరెన్సీ వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే బోయకొండపై వెలసిన రణభేరి గంగమ్మ ఆలయంలో హుండీ లెక్కించగా రూ.59,916 ఆదాయం సమకూరినట్లు ఈఓ వెల్లడించారు.

పోలీసుల స్పందనకు 20 ఫిర్యాదులు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కరించగా.. మరికొన్ని పరిష్కార నిమిత్తం ఆయా స్టేషన్ పరిధి అధికారులకు అప్పగించారు. మొత్తం 20 ఫిర్యాదులు రాగా అందులో ఇంటి తగాదాలు 2, చీటింగ్ 3, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 1, ఆస్తి తగాదాలు 2, భూ తగాదాలు 9 చొప్పున అందాయని అధికారులు పేర్కొన్నారు.

ఆర్టీఓగా సునీల్‌కుమార్ బాధ్యతలు



ఆర్టీఓను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంవీఐలు

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీఓగా సునీల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంవీఐలు రాజేశ్వరరావ్, వాసుదేవరెడ్డి పుష్పగుచ్ఛం అందించి.. మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన శాఖ పనితీరును అడిగి తెలుసుకున్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలకు అధిక ప్రాధాన్యం

- సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అర్జీదారుడికి ముందస్తు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. సాంకేతికంగా ఏవైనా సమస్యలుంటే రెండు రోజుల్లో పరిష్కరించాలని టెక్నికల్ సిబ్బందిని ఆదేశించారు. డీఆర్వో ఎన్. రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

- చెన్నైకి చెందిన యువరాజ్, నాగజ్యోతి దంపతులు ఇటీవల సింగపూర్ నుంచి ఇండియాకు వచ్చారు. తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో బయలుదేరారు. నగరి పట్టణ సమీపంలోని ధర్మాపురం వద్ద వారి కారు డ్రైవర్ ఇళంగోవన్ ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు రాంగ్‌రూట్‌లోకి ప్రవేశించి ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ మృతి చెందారు.
- తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన 13 మంది వ్యాన్‌లో తిరుమలకు బయలుదేరారు. నగరి మండలం గుండ్రాజుకుప్పం మలుపు వద్ద మితిమీరిన వేగం కారణంగా వాహనం అదుపుతప్పింది. డ్రైవర్ కంట్రోల్ చేయలేకపోవడంతో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అంకిత్ (5) అనే బాలుడు మరణించగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఇవి మచ్చుకు రెండే.. రోడ్డు నిబంధనలను అతిక్రమించడం, అతివేగంగా నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ఈ ఏడాది ఒక్క నగరి నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటి వరకు 43 ప్రమాదాలు జరిగాయి. 33 మంది మృత్యువాత పడగా, సుమారు 40 మంది గాయాలపాలయ్యారు.



ఆదమరిస్తే.. అంతిమయాత్రే!



ఒకరి నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాలను దిక్కులేని వారిగా మారుస్తోంది.. ఒకరి దుందుడుకు స్వభావం ఎన్నో జీవితాల్లో చీకట్లు నింపుతోంది.. ఒకరి నిర్లక్ష్యం ఎన్నో బతుకులను శోక సంద్రంలోకి నెట్టేస్తోంది.. నిత్యం రోడ్డు ప్రమాదాల కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. తల్లిదండ్రులకు కడుపుకోతను మిగులుస్తున్నారు. భార్యాబిడ్డలను అనాథలుగా మారుస్తున్నారు.. భవిష్యత్‌పై ఆశలను ఆవిరి చేసేస్తున్నారు.

- అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు
- డ్రైవర్ తప్పిదం వల్లే టోల్‌గేట్ వద్ద విషాద ఘటన
- పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం
- కుటుంబసభ్యులకు అప్పగింత

నగరి : అజాగ్రత్త, అతి వేగం పలువురి ఆయుష్షును హరించేస్తోంది. వ్యాపార అవసరాలు, విహారయాత్రలు, వినోదాలు, వేడుకలు, ఉత్సవాలు, జాతరలు తదితర కారణాలతో పలువురు కుటుంబసమేతంగా, మిత్రులతో కలిసి వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. ఇలా కలిసికట్టుగా వెళ్లే ప్రయాణాలంటే చాలామంది ఉత్సాహం చూపిస్తుంటారు. అయితే వారి ఆనంద యాత్రలను వాహనాలు నడిపే డ్రైవర్లు క్షణాల్లో అంతిమయాత్రలుగా మార్చేస్తున్నారు. అంతా సజావుగా సాగినప్పుడు పర్లేదు కానీ, దురదృష్టవశాత్తు ఏదైన ప్రమాదం జరిగితే చాలా జీవితాలు తలకిందులవుతుంటాయి. ఇటీవల కాలంలో ఎందరో మైనర్లు, యువకులు, డ్రైవర్లు నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల కారణమవుతున్నారు.. తమతోపాటు పక్క వారి ప్రాణాలకు ముప్పు తీసుకువస్తున్నారు. ఇలా ఓ డ్రైవర్ చేసిన తప్పు వల్లే ఆదివారం వడమాలపేట టోల్‌గేట్ వద్ద ప్రమాదం జరిగింది. ఐదుగురి ఆయువును బలితీసుకుంది.

మిన్నంటిన రోదనలు

అంజేరమ్మ కనుమ వద్ద ప్రమాదంలో మరణించిన బంధువుల రోదనలు మిన్నంటాయి. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తమ ఆత్మీయులను విగతజీవులగా చూసిన బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. విషణ్ణవదనాలతో మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకుని వెళ్లారు.

షాక్‌తో గుండెఆగింది

జీడీనెల్లూరు మండలం, కొట్రకోనకు చెందిన శివకుమార్ (61) హెరిటేజ్ సంస్థలో లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఆయన పెద్ద కుమారుడు ట్రైన్ యాక్సిడెంట్‌లో మృతి చెందాడు. ఒక కుమార్తె, మరో కుమారుడు ఉన్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారి జీవనాధారం శివకుమార్ పైనే ఆధారపడి ఉంది. టోల్‌గేట్ వద్ద జరిగిన ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. అయితే ప్రమాదానికి గురైన వాహనంలో నుంచి కిందకు దూకడంతో పాటు, అక్కడి విషాద దృశ్యాలను చూసి షాక్‌తో గుండె ఆగిపోయింది. దీంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మాకు దిక్కెవరు దేవుడా..



రేవంత్ మృతదేహం తరలిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఐరాల మండలం, కలిగిరిపల్లెకు చెందిన రేవంత్ కుమార్ (26) వడమాలపేట మండలం టోల్ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి ఏడాది క్రితమే వివాహమైంది. పది నెలల బిడ్డ ఉంది. గతంలోనే తండ్రి మరణించడంతో తల్లికి, భార్యాబిడ్డలను రేవంత్‌కుమార్ కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. ఇప్పుడు అతడు మృతి చెందడం ఆ కుటుంబం తల్లడిల్లిపోతోంది. మాకు దిక్కెవరు దేవుడా అంటూ కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది.

విగతజీవిగా ఇంటి పెద్ద..



గిరిజమ్మ మృతదేహాన్ని తీసుకెళుతున్న దృశ్యం

తిరుపతిలోని గోపాలరాజు కాలనీకి చెందిన గిరిజమ్మ(48) కష్టపడి కొడుకు, కుమార్తెను పోషించుకుంది. ఇద్దరు పిల్లలకు మంచి సంబధాలు కుదిర్చి పెళ్లి కూడా చేసింది. అయినా కుటుంబానికి భారం కాకూడదని సొంతగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటోంది. ఈ క్రమంలో రియల్ వ్యాపారులతో ఏర్పడిన పరిచయంతోనే వడమాలపేట అంజేరమ్మ కనుమలో పూజలకు వెళ్లింది. అక్కడ జరిగిన ప్రమాదంలో విగతజీవిగా మారింది.

యమపురికి 'షార్ట్‌కట్'



ప్రాణాలు హరిస్తున్న షార్ట్‌కట్ రూట్ ఇదే..

టోల్‌గేటు నుంచి అంజేరమ్మ కనుమకు వెళ్లే మార్గంలో పలువురు ఎంచుకుంటున్న షార్ట్‌కట్ దారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ట్రాఫిక్ నిబంధనల మేరకు వెళ్లాల్సిన మార్గంలో కాకుండా ఈ షార్ట్‌కట్‌లో వెళితే కేవలం 5 కిలోమీటర్ల దూరం మాత్రమే తగ్గుతుంది. దీనికోసం చాలామంది రాంగ్‌రూట్‌ను ఎంచుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు.

అధికారుల సూచనలు

- వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్ తన చేతుల్లో పలువరు ప్రయాణికుల ప్రాణాలున్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ ఆలోచనతో జాగ్రత్తగా వాహనాన్ని నడపాలి. రోడ్డు భద్రతా నిబంధనలను అతిక్రమించకూడదు.
- వాహనాలు నడిపే సమయంలో నిద్ర వస్తే ఎక్కడైనా వాహనాన్ని నిలుపుకోవాలి. కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ వాహనం నడపాలి.
- మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నడపకూడదు.
- తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు కొనుగోలు చేసి ఇచ్చే సమయంలోనే రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, అధిక వేగం, రేసింగ్‌ల జోలికి వెళ్లకూడదని స్పష్టం చేయాలి.

వాహనం నడపాలంటే..

- మోటారు వాహనాల చట్టం1988, సెక్షన్(4) ప్రకారం 18 ఏళ్లలోపువారు మోటార్ వాహనం నడపకూడదు.
- తల్లిదండ్రుల అనుమతితో 16 ఏళ్లు దాటిన వారు 50 సీసీకి మించని ఇంజను సామర్థ్యం కలిగిన గేర్లులేని మోటారు సైకిల్ లైసెన్స్ పొందవచ్చు.
- ఇరవై ఏళ్లలోపు వ్యక్తులు ట్రాన్స్‌పోర్టు వాహనాలు నడపకూడదు.

కనీస జాగ్రత్తలు తప్పనిసరి



వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా కనీస జాగ్రత్తలు పాటించాలి. నిబంధలకు విరుద్ధంగా డ్రైవింగ్ చేసేవారిని హెచ్చరిస్తున్నాం. జరిమానాలు విధిస్తున్నాం. వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ నియమాలను పాటించాలి. డ్రైవర్లు సమర్థతతో వాహనం నడపాలి. లేకుంటే ప్రయాణించేవారు ప్రాణాలు కోల్పోవడమో, గాయాలపాలు కావడమో జరుగుతుంది. – వి.శ్రీనివాసరావ్, డీఎస్పీ, పుత్తూరు

తొలిరోజే 'కానుక' కాంతులు

- విద్యార్థులు, తల్లిదండ్రులతో నందడిగా పాఠశాలలు
- అట్టహాసంగా జగనన్న విద్యాకానుక కార్యక్రమాలు
- పండుగ వాతావరణంలో కిట్‌లు అందుకున్న పిల్లలు



విద్యార్థినికి జగనన్న విద్యాకానుక కిట్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్యే, మేయర్

నాడు

టీడీపీ పాలనలో బడులు తెరిచిన సమయంలో ఒకటి, రెండు పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఇచ్చేవారు. అవి కూడా కొందరికి మాత్రమే అందేవి. పాఠశాలల్లో కనీస వసతులు కూడా ఉండేవి కాదు. దీంతో తల్లిదండ్రులకు సర్కారు బడులపై నమ్మకం లేక ప్రైవేటు స్కూళ్ల బాట పట్టేవారు.

నేడు

బడులు పునఃప్రారంభమైన తొలిరోజే హాజరైన విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కింద పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ తదితర సామగ్రితో కూడి కిట్‌లు అందిస్తున్నారు. పండుగ వాతావరణంలో తల్లిదండ్రుల సమక్షంలోనే పంపిణీ చేస్తున్నారు. అదే సమయంలో పాఠశాలలను కార్పొరేట్ హంగులతో వసతులను అందుబాటులోకి తీసువచ్చారు. దీంతో పిల్లలు అధిక సంఖ్యలో సర్కారు బడుల బాట పడుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన డెస్కులు

జిల్లా సమాచారం

ప్రభుత్వ పాఠశాలలు : 1,918

విద్యార్థులు : 1,67,154

కిట్‌లు వెచ్చించిన మొత్తం : రూ.41.79 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బడులను మామిడి తోరణాలు, బెలూన్లు, రంగు రంగుల కాగితాలతో అలంకరించారు. ఉపాధ్యాయులు ముందుగానే పాఠశాలలకు చేరుకుని విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యాకానుక కిట్‌ల పంపిణీ చేపట్టారు. సోమవారం రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా అయా మండలాల్లోని సర్కారు బడుల్లో కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

తొలిరోజే పంపిణీ

చిత్తూరులోని గిరింపేట మున్సిపల్ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు అందించే నిజమైన ఆస్తి విదే అని ముఖ్యమంత్రి భావిస్తున్నారన్నారు. బడులు తెరిచిన రోజే విద్యాకానుక కిట్లు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్‌లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. మేయర్ అముద మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి జగనన్న అమ్మఒడి పథకాలనికి చిత్తూరు నుండే శ్రీకారం చుట్టారన్నారు. ఈఓ విజయేంద్ర రావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకను విద్యార్థులు జాగ్రత్త గా వినియోగించు కోవాలని సూచించారు. అనంతరం గిరింపేట పురపాలక ఉన్నత పాఠశాలలో చదువుతున్న 480 మంది విద్యార్థులకు రూ.12 లక్షల విలువైన కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్ రెడ్డి, రాజేష్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, ఎంఈఓ సెల్వీరాజ్, కౌన్సిలర్ ఇందు పాల్గొన్నారు.

కానుక బావుంది



నేను గిరింపేట ఉన్నత పాఠశాలలో 7 వతరగతి చదువుతున్నా. బడి ప్రారంభం కాగానే మాకోసం జగన్ మామ విద్యాసామగ్రి పంపించారు. విద్యాకానుక కిట్ చాలా బావుంది.
– కె. సిన్హా, విద్యార్థి, శంకర్ రాయల్ పేట, చిత్తూరు

అన్నీ ఒకేసారి ఇచ్చారు



నాకు కావాల్సిన విద్యాసామాగ్రి మొత్తం ఒకే కిట్టుగా ఇచ్చారు. మొదటి రోజే బ్యాగ్‌తో పాటు పుస్తకాలు, షూలు, దుస్తులు అన్నీ అందజేశారు. మా పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. టీచర్లు బాగా పాఠాలు చెబుతున్నారు.
– ఆర్.సాథియా,10వ తరగతి, మున్సిపల్ హైస్కూల్, చిత్తూరు

సంతోషంగా ఉంది



మా పాప ఉదయశ్రీ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజునే జగనన్న విద్యా కానుక కిట్ ద్వారా యూనిఫామ్, షూలు, సాక్సులు, టెస్ట్ బుక్‌లు, నోటు బుక్‌లు అందించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.
– కుమారి, విద్యార్థి తల్లి, వైఎస్ కాలనీ,చిత్తూరు

బడి బస్సుల తనిఖీ

- రవాణాశాఖ అధికారుల ప్రత్యేక డ్రైవ్
- పలు కేసులు నమోదు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

చిత్తూరు రూరల్: పాఠశాలలు పునః ప్రారంభంలో భాగంగా చిత్తూరు నగరంలో ప్రైవేటు బడి బస్సులపై సోమవారం జిల్లా రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. ఉదయం 6.30 గంటలకే రోడెక్కిన అధికారులు బడి బస్సులపై పూర్తిసాయిలో నిఘా పెట్టారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి క్షుణంగా బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని 23 బస్సులకు బ్రేకులు వేశారు. ఇందులో 15 ఎఫ్‌సీ లేని వాహనాలు, 1 ఓవర్ లోడ్, 5 బస్సులు సీజ్ చేయడంతో పాటు ఇతరాత్ర సమస్యలను గుర్తించి 10 బస్సులపై కేసులు నమోదు చేశారు. మరో రెండు రోజులపాటు కూడా ఈ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎంవీఐలు రాజేశ్వరరావ్, వాసుదేవారెడ్డి, శివయ్య తెలిపారు.

ఫిట్‌నెస్ పరీక్షకు క్యూ కట్టిన బస్సులు

పాఠశాలలను పునః ప్రారంభం కావడంతో ఫిట్‌నెస్ పరీక్ష కోసం చిత్తూరు నగరంలోని డీటీసీ కార్యాలయానికి స్కూల్ బస్సులు పదుల సంఖ్యలో క్యూకట్టాయి. కార్యాలయ ఆవరణంతో పాటు రోడ్డుపై వరుసలో నిలుచున్నాయి. మధ్యాహ్నం వరకు 42 బస్సులకు వరకు ఎంవీఐలు క్షుణంగా పరిశీలించారు. అన్ని రకాలుగా బస్సులను తనిఖీ చేసి కండిషన్ సరిగా ఉన్న వాటినే రోడ్డుపై తిప్పేందుకు అనుమతులు ఇచ్చారు. ఏమాత్రం కండిషన్ సక్రమంగా లేకపోయినా అనుమతులు నిరాకరించారు.

పసుపు పొడి విక్రయాలకు శ్రీకారం



పసుపు పొడి విక్రయాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు అర్బన్: జిల్లా సమాఖ్యకు ఆదాయ వనరులు సమకూర్చడానికి చిత్తూరు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాణ్యమైన పసుపు పొడి విక్రయాలకు శ్రీకారం చుట్టారు. సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ డీఆర్‌డీఏ తులసి ఈ విక్రయాలను లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, ఇతర వస్తువులతో పాటు సహజసిద్ధమైన తేనెను విక్రయిస్తున్నారు. అలాగే మహిళా మార్టుల ఆధ్వర్యంలో నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు విక్రయిస్తూ అనతి కాలంలోనే ప్రజలకు చేరువయ్యారు. దీంతో మహిళా మార్టులకు ఆదరణ పెరిగింది. ఈ నేపథ్యంలో నాణ్యమైన పసుపు పొడిని విక్రయించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమాఖ్యకు ఆదాయ వనరులు సమకూర్చడానికి డీఆర్‌డీఏ చేస్తున్న కృషిని కొనియాడారు. ఇప్పటికే వివిధ రకాల వ్యాపారాలను కొనసాగిస్తున్న జిల్లా సమాఖ్య తాజాగా నాణ్యమైన పసుపు పొడిని మార్కెట్లో అందుబాటులో ఉంచడం గొప్ప విషయం అన్నారు. ఈ పసుపు పొడి త్వరగా ప్రజల మన్ననలు అందుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేసి పసుపు పొడిని కొనుగోలుచేశారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో పలువురు రైతుల వద్ద నుంచి నాణ్యమైన పసుమ కొనుగోలుచేసి జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పొడిచేసి ప్యాకెట్ రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ ప్యాకెట్లను జిల్లావ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మార్కెట్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వెంకటేష్, జిల్లా సమాఖ్య ప్రతినిధులు జయశ్రీ,, ప్రతిభ, లోకేశ్వరి, సెల్వి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కుప్పంలో బాబు పర్యటన

కుప్పం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 14న కుప్పం పర్యటనకు రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. 16వ తేదీ వరకు ఆయన నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక బీసీఎన్ కన్వెన్షన్ హాలులో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారని వివరించాయి. గురువారం సాయంత్రం 4 గంటలకు కుప్పంలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారని వెల్లడించాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు చంద్రబాబు బెంగళూరు పయనమవుతారని స్పష్టం చేశాయి.

చెంగాళమ్మ విజయోత్సవం

భక్తుల కొంగుబంగారంగా.. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వర్ధిల్లుతున్న శ్రీచెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి కాళంగి నదీతీరాన నిర్వహించిన తెప్పోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. వేలాది మంది భక్తుల నడుమ అమ్మవారు కాళంగి నదిలో ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపై విహరిస్తూ కనువిందు చేశారు. బాణసంచా వెలుగులు.. భక్తుల జేజేలతో ఆ ప్రాంతం మార్మోగింది. మహిషాసురమర్దనం చేసి విజయోత్సాహంతో అమ్మవారు తెప్పలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

- అంగరంగ వైభవంగా చెంగాళమ్మ తల్లి తెప్పోత్సవాలు
- కాళంగి నదిలో విహరించిన అమ్మవారు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

చెంగాళమ్మ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి అమ్మవారికి శయనోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సూళ్లూరుపేట: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి చెంగాళమ్మతల్లి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తెప్పోత్సవానికి సూళ్లూరుపేట పరిసరప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు జిల్లా, తమిళనాడు నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేసి తరించారు. అమ్మా.. చెంగాళమ్మ తల్లీ.. దీవించమ్మా.. అంటూ నినదించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో సుళ్ల ఉత్సవం, మహిషాసురమర్ధనం, తెప్పోత్సవం ప్రధానమైనవి కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. కాళంగినదిలో అమ్మవారు లాహిరి..లాహిరి..లాహిరిలో..అంటూ తెప్పపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. తెప్పోత్సవానికి తడ మండలం, వాటంబేడు కుప్పానికి చెందిన మత్స్యకారులు రెండు నాటు పడవలను జోడించి ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పడవకు ప్రత్యేకంగా విద్యుదీపాలంకరణ చేసి అమ్మవారిని ఆశీనులు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.


గాయపడిన యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా

తెప్పోత్సవంలో బాణసంచా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు రెండు గంటలు సేపు ఆకాశంలో వేల మెగావాట్ల విద్యుత్ దీపాలు వెలిగినట్టు ఆ ప్రాంతమంతా రంగు రంగుల వెలుగులతో నిండిపోయింది.

భారీ బందోబస్తు

బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 450 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. స్థానిక సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, వాకాడు సీఐ హరికృష్ణ, నరసింహులు ఆధ్వర్యంలో దగ్గరుండి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

భక్తులకు అండగా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సుళ్ల ఉత్సవం అనంతరం గాలివానకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో ఓ భక్తుడు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే మైదానంలో ఫెన్సింగ్‌పై సదరు భక్తుడు కాలు పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన పోలీసులు బాధితుడికి అండగా నిలిచారు. హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాణాలు నిలిపారు.


అశేష భక్తజనం నడుమ తెప్పపై విహరిస్తున్న చెంగాళమ్మతల్లి (ఇన్‌సెట్) తెప్పోత్సవం సందర్భంగా బాణసంచా వెలుగులు

పరమేశ్వరి సేవలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్రసాంకేతిక, భూగర్భ గనులశాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత దంపతులు సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి ఆలయం వద్దకు విచ్చేయగా.. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, పార్టీ నాయకులు గజ మాలతో ఘనంగా సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో ఆహ్వానం పలికారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి దంపతులు అమ్మవారికి సారెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా ఎమ్మెల్యే, ఆలయ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, పార్టీ నారాయకలు కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, తుపాకుల ప్రసాద్, కే రఘు, స్వామిరెడ్డి, జెట్టివేణుయాదవ్, రామకృష్ణారెడ్డి, శేషారెడ్డి, గోగుల తిరుపాల్, వాకాటి బాబురెడ్డి, నాయుడుపేట నాయకులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కట్టా రమణారెడ్డి, కిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి సారె తీసుకువెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

అనుమానాస్పదంగా మహిళ మృతి

గంగవరం : మండలంలోని పాత సెరికల్చర్ కార్యాలయం వద్ద పాడు బడిన బావిలో సోమవారం ఓ మహిళ మృతదేహం వెలుగుచూసింది. వివరాలు.. బైరెడ్డిపల్లె మండలం కుప్పనపల్లెకు చెందిన పుష్ప(32)కు పలమనేరు గాంధీనర్‌లోని ఈశ్వర్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి అరుణ్ (7వ తరగతి), చెర్రీ (6వ తరగతి) ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లుగా ఈశ్వర్ మద్యానికి బానిసకావడంతో రోజూ భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్రవారం రోజు మళ్లీ ఇరువురూ గొడవ పడ్డారు. దీంతో పుష్ప ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై కుటుంబీకులు పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో పుష్ప మృతదేహం బావిలో తేలడంతో అక్కడి వాచ్‌మన్ వెంటనే పోలీసులకు సమాచారం అందిచాడు. వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. దీనిపై మృతురాలి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పుష్పకు ఈత వచ్చని వెల్లడిస్తున్నారు. ఆమె భర్తే కచ్చితంగా హత్య చేసి బావిలో పడేసి ఉంటాడని ఆరోపిస్తున్నారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పిల్లలతో పుష్ప (ఫైల్)

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని బాట గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృత చెందాడు. వివరాలు.. పెద్దగొట్టిగల్లుపంచాయతీ బోనంవారిపల్లెకు చెందిన శ్రీరాములు (76) బాట గంగమ్మ ఉత్సవాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 సిబ్బంది తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీరాములు (ఫైల్)

రెండు బైక్‌ల ఢీ: ఒకరికి గాయాలు

గంగవరం : మండలంలోని సాయినగర్‌కు చెందిన రామలింగం(70) బైక్‌పై సోమవారం పలమనేరు వైపునకు వెళుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామలింగం తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వరకట్న వేధింపుల కేసులో ఇద్దరి అరెస్ట్

- విదేశాలకు వెళుతుండగా అదుపులోకి తీసుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు

సాక్షి, అమరావతి: వరకట్న వేధింపుల కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు విదేశాలకు వెళుతుండగా చెన్నై విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని మీనంబాకం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ సమాచారాన్ని మీనంబాకం పోలీసులు కేసు నమోదు చేసిన విశాఖపట్నం పోలీసులకు అందించారు. దీంతో విశాఖ పోలీసులు చెన్నై వచ్చి స్థానిక కోర్టు అనుమతితో వారిని ట్రాన్సిట్ వారెంట్ మీద విశాఖపట్నంకు తరలించారు. లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ అయిన నేపథ్యంలో తిరుపతికి చెందిన అనంత రమేష్ నాయుడు, ఆయన కుమారుడు అనంత యోగ శ్రీనివాస్ ఈనెల 11న దుబాయ్ వెళుతుండగా వారిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరుకు చెందిన మేఘన వివాహం తిరుపతికి చెందిన అనంత రమేష్ రవితేజతో 2020లో జరిగింది. రవితేజ విదేశాల్లో ఉద్యోగం చేస్తుండడంతో మేఘన తల్లిదండ్రులు వివాహం సందర్భంగా పెద్ద మొత్తంలో కట్న కానుకలు సమర్పించారు. వివాహం అయిన నాటి నుంచే భర్త రవితేజ, కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ మేఘన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విశాఖపట్నం దిశా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో మేఘన సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐడీ అదనపు డీజీ ఆదేశాల మేరకు రవితేజ, ఆయన తల్లిదండ్రులు, తమ్ముడు, మరదలిపై లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ అయింది. ఇదిలా ఉండగా రమేష్ నాయుడు, అతని కుమారుడు యోగి శ్రీనివాస్ ఆదివారం దుబాయ్ వెళ్లేందుకు చెన్నై విమానాశ్రయానికి వచ్చారు. వీరిపై లుక్‌ఔట్ నోటీసులు ఉండడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమాచారం అందుకున్న విశాఖ దిశ పోలీసులు వారిని ట్రాన్సిట్ వారెంట్ మీద విశాఖపట్నంకు తరలించారు.

డ్రైవర్ల చేతిలోనే విద్యార్థుల ప్రాణాలు

తిరుపతి మంగళం : విద్యార్థుల ప్రాణాలు ఆయా పాఠశాలల వాహనాల డ్రైవర్ల చేతిలోనే ఉంటాయన్న విషయాన్ని డ్రైవర్లు గుర్తుపెట్టుకోవాలని జిల్లా రవాణాశాఖాధికారి (డీటీవో) సీతారామిరెడ్డి తెలిపారు. కళాశాలలు, స్కూల్స్ ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం తిరుపతి-కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రైవర్లకు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సి జాగ్రతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలు తమ చేతుల్లో ఉన్నాయన్న భయంతో డ్రైవర్లు వాహనాలను నడపాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం సేవించడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎఫ్‌సీ చేయకుండా విద్యార్థులను తరలిస్తున్న మూడు పాఠశాలల వాహనాలను రవాణాశాఖ అధికారులు సీజ్ చేశారు. స్కూల్స్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి కళాశాల, స్కూల్ బస్సులకు ఎఫ్‌సీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కుసుమ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పలమనేరు: మండలంలోని కాలువపల్లి వద్ద పలమనేరు– గుడియాత్తం రోడ్డుపై సోమవారం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో కాలువపల్లికి చెందిన సుబ్రమణ్యం(26) అనే వ్యక్తి మృతి చెందాడు. స్వగ్రామానికి ఆటోలో వెళుతుండగా ఆటో బోల్తా పడిన సందర్భంలో సుబ్రమణ్యం కిందపడగా అతనిపై ఆటో పడడంతో తలకు గాయమైంది. ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. దీనిపై పలమనేరు పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం


రాలీ నిర్వహిస్తున్న అధికారులు, మహిళలు

చిత్తూరు అర్బన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం చిత్తూరులో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్‌రావుతో కలెక్టర్ ర్యాలీ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంద శాతం బాల కార్మికులు లేకుండా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవ్యతిరేకమని స్పష్టం చేశారు. పిల్లలు చదువుకుంటే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. న్యాయమూర్తి కరుణ కుమార్ మాట్లాడుతూ బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓంకార్ రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా జరిగిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఇద్దరు బాల కార్మికులను గుర్తించి సంబంధిత యాజమానులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి జగదీష్ బాబు, దిశ ఎస్ఐ నాగసౌజన్య, సీడీపీఓ నిర్మల, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నలుగురు ఎర్ర దొంగల అరెస్ట్


ఎర్రచందనం దుంగలతోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు


మాట్లాడుతున్న సీఐ కోటేశ్వరావు, రంగనాథ్‌గౌడ్

రాపూరు: వెలుగొండ అడవుల నుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న తొమ్మిది ఎర్రచందనం దుంగలను ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్టు రాపూరు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. వీటిని తరలిస్తున్న నలుగురు స్మగ్లర్లను కూడా అదుపులోకి తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. వెలుగొండ అడవుల నుంచి ఎర్రచందనం తరలిస్తున్నట్లు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్‌కు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి టోల్‌ప్లాజా వద్ద ఏపూరు నుంచి రాపూరు వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 9 ఎర్రచందనం దుంగలు, నలుగురు వ్యక్తులు, 5 సెల్‌ఫోన్లు, వారికి ఎస్కార్ట్‌గా వచ్చే కారును గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. పట్టుబడిన వారిలో శ్రీకాళహస్తికి చెందిన షబీర్, మున్నతోపాటు తమిళనాడుకు చెందిన మాణిక్యంగోవిందరాజ్, ముత్తుతీర్థన్ ఉన్నట్టు పేర్కొన్నారు. వీరిని విచారించగా బెంగళూరుకు చెందిన వ్యక్తి రాపూరు మండలం, తెగచర్ల గ్రామ సమీపంలోని అడవుల్లోకి తమిళ కూలీలను పంపి ఎర్రచందనం దుంగలను నరికిస్తున్నట్టు తేలింది. ఎర్రచందనం దుంగలు తరలించేందుకు ఐదుగురు తమిళ కూలీలు రాగా అందులో ముగ్గురు వేరే వాహనంలో తప్పించుకెళ్లినట్టు గుర్తించారు. 9 ఎర్రచందనం దుంగల బరువు 231 కిలోలు ఉన్నట్టు సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్న పోలీసులను డీఎస్పీ కోటారెడ్డి అభినందించారు.